సాక్షి
సంగారెడ్డి
గురువారం । 21 । సెప్టెంబర్ । 2023

డబుల్ పండగ

మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా నేడు రెండో విడత ఇళ్ల పంపిణీ

- 4,500 మంది లబ్ధిదారులకు నెరవేరనున్న సొంతింటికల
- కొల్లూరులోని కేసీఆర్‌కాలనీ ముస్తాబు



కొల్లూరులోని కేసీఆర్ కాలనీలో సిద్ధమైన డబుల్ బెడ్‌రూం ఇళ్లు

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : నిరుపేదల కోసం ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు రెండో విడత పంపిణీకి సిద్ధమయ్యాయి. గురువారం కొల్లూర్‌లో ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు చేతులమీదుగా 4,500 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను పంపిణీ చేయనున్నారు. నిరుపేదల సొంతింటి కలను నిజం చేయాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి దేశంలో ఎక్కడా లేని విధంగా కొల్లూర్‌లో 145 ఎకరాలలో 15,660 డబుల్ బెడ్ రూం ఇళ్లను నిర్మించారు. మెరుగైన సౌకర్యాలతో ఈ డిగ్నిటీ హౌసింగ్ కాలనీని నిర్మించారు. రెండో విడతలో భాగంగా జీహెచ్‌ఎంసీ పరిధిలోని సుమారు తొమ్మిది నియోజకవర్గాలకు చెందిన లబ్ధిదారులకు వాటిని పంపిణీ చేస్తున్నారు. గతకొద్ది రోజుల క్రితం డిగ్నిటీ హౌసింగ్ కాలనీ కొల్లూర్–1లో జీహెచ్‌ఎంసీ పరిధిలోని 1,700 మంది లబ్ధిదారులకు మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా ఇళ్ల పట్టాలను, తాళాలను సైతం అందజేశారు. గత జూన్‌లో తెల్లాపూర్ మున్సిపల్ కొల్లూర్‌లో ఉన్న కేసీఆర్ నగర్ కాలనీలో ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా ఆరుగురు లబ్ధిదారులకు ఇళ్లను అందజేయడం తెలిసిందే.

లాటరీ పద్ధతిలో కేటాయింపు

పటాన్‌చెరు: అద్దె ఇల్లు... చాలీచాలని జీతాలతో జీవితం వెళ్లదీస్తున్న నిరుపేద ప్రజలకు అత్యంత ఖరీదైన ప్రాంతంలో 50 లక్షల రూపాయల విలువ చేసే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కట్టించి అందజేస్తున్న మహోన్నత నాయకుడు కేసీఆర్ అని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. నియోజకవర్గం పరిధిలోని భారతినగర్, రామచంద్రపురం, పటాన్‌చెరు డివిజన్ పరిధిలో రెండో విడతలో ఎంపికైన 500 మంది లబ్ధిదారులతో బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖాముఖి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కులం, మతం, ప్రాంతం తేడా లేకుండా రాజకీయాలకు అతీతంగా పూర్తి పారదర్శకతతో అత్యంత ఆధునిక సాఫ్ట్‌వేర్ సహాయంతో లబ్ధిదారులను ఎంపిక చేశామన్నారు. కొల్లూరులో లాటరీ పద్ధతిన బ్లాక్ లు కేటాయింపులు ఉంటాయని వెల్లడించారు. కార్యక్రమానికి వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ముఖ్యఅతిథిగా హాజరు కాబోతున్నట్లు పేర్కొన్నారు. ఇక్కడి లబ్ధిదారులందరినీ క్యాంపు కార్యాలయం నుంచి బస్సులు ద్వారా కొల్లూరుకు తీసుకొని వెళతామన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు మెట్టుకుమార్ యాదవ్, పుష్ప నగేశ్, సింధు ఆదర్శ్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేశ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్‌రెడ్డి, శ్రీధర్ చారి తదితరులు పాల్గొన్నారు.

నిరంతరం ప్రక్రియ



కేసీఆర్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు నిరుపేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లను దేశంలో ఎక్కడ లేని విధంగా నిర్మించి అందిస్తున్నారు. ఇది నిరంతర ప్రక్రియ అర్హులైన ప్రతి పేదవాడికీ రెండు పడకల ఇళ్లను అందిస్తాం.

–గూడెం మహిపాల్ రెడ్డి, ఎమ్మెల్యే

డబుల్ బెడ్ రూం ఇళ్ల విశేషాలు

- కాలనీ విస్తీర్ణం 145.50 ఎకరాలు
- ప్రాజెక్టు వ్యయం రూ.1,489.29కోట్లు
- 2018లో నిర్మాణం ప్రారంభించగా 2021 జనవరి 26న పూర్తి
- 117 బ్లాక్‌లు, 15,660 డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం
- ఒక్కో ఇంటి విస్తీర్ణం 580 చదరపు అడుగులు
- జీ+9లో 38 బ్లాక్‌లు, జీ+10లో 24 బ్లాక్‌లు, జీ+11లో 55 బ్లాక్‌లుగా నిర్మాణం
- 11 కేఎల్ కెపాసిటీ గల 10 వాటర్ సంపులు
- ప్రతి బ్లాక్‌లో రెండు లిఫ్ట్‌లు
- ఆధునిక అగ్ని నిరోధక వ్యవస్థ
- 137 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు
- పార్కులు, దుకాణ సముదాయం, క్రీడా మైదానాలు, ప్రార్థన మందిరాలు ఏర్పాటు

బీజేపీ బస్సుయాత్ర!

ఎన్నికల వేళ సన్నాహాలు

- ఉమ్మడి జిల్లాలో రెండు రూట్లుగా విభజన
- రోజుకు రెండు నియోజకవర్గాలు, ఐదు వేల మందితో సభలు
- అధికార పార్టీ వైఫల్యాలను ఎండగట్టాలని నిర్ణయం
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల అక్రమాలపైనా ఫోకస్?

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : ఎన్నికల వేళ భారతీయ జనతా పార్టీ బస్సు యాత్ర నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు జిల్లాలోని ఆ పార్టీ ముఖ్యనేతలను, నాయకులను సమాయత్తం చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో చేసిన అభివృద్ధి పనులను వివరించడం, ఎన్డీఏ సర్కారు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా త్వరలో రానున్న ఎన్నికల్లో ఓటర్లను ఆకర్షించాలని భావిస్తోంది. యాత్రలో జాతీయ నాయకులు, రాష్ట్ర స్థాయి ముఖ్య నాయకులు పాల్గొనేలా చేస్తోంది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, చేరికల కమిటీ ఇన్‌చార్జి ఎమ్మెల్యే ఈటల రాజేందర్, పార్టీ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ తదితరుల్లో ఒకరు ఇందులో పాల్గొనేలా ప్రణాళికను రూపొందిస్తోంది.

రోజుకు రెండు నియోజకవర్గాల్లో..

ఉమ్మడి జిల్లాలో రెండు భాగాలుగా యాత్రను నిర్వహించే యోచనలో పార్టీ నాయకత్వం ఉంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రారంభం కానున్న ఈ యాత్రం ఉమ్మడి నిజామాబాద్‌లో ముగించుకుని, ఉమ్మడి మెదక్ జిల్లాలోకి ప్రవేశిస్తుంది. రోజుకు రెండు అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా కొనసాగేలా జిల్లా నాయకత్వం ప్రణాళికను రూపొందిస్తోంది. నారాయణఖేడ్, అందోల్, జహీరాబాద్, సంగారెడ్డి, పటాన్‌చెరు, నర్సాపూర్, మెదక్ నియోజకవర్గాలను కలుపుకొని ఒక బస్సు యాత్ర నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిసింది.

ఆ మూడు నియోజకవర్గాల్లో మరో యాత్ర

ఉమ్మడి జిల్లాలో సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాలను మరో రూట్ యాత్ర ద్వారా కవర్ చేసేలా ప్రణాళికను రాష్ట్ర నేతలు సిద్ధం చేస్తున్నారు. రోజు ఆయా నియోజకవర్గాల్లో ఏదైనా ప్రధాన కూడలి వద్ద సభ నిర్వహించాలని, కనీసం ఐదు వేల మందిని తరలించాలని భావిస్తున్నారు. పార్లమెంట్ సమావేశాలు ముగిసిన వెంటనే షెడ్యూల్ పూర్తి స్థాయిలో ఖరారవుతుందని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు.

అక్రమాలు ఎండగట్టేలా

ఈ యాత్రలో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల అక్రమాలను ఎండగట్టాలని బీజేపీ భావిస్తోంది. ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు వారి అనుచరులు చేస్తున్న భూకబ్జాలు, ఇసుక, మట్టి, మొరం దందాలు, చెరువుల ఆక్రమణలు, ఇలా ఎమ్మెల్యేలు వారి ప్రధాన అనుచరుల వివాదాలపైనా ఫోకస్



చేయాలని భావిస్తోంది. తద్వారా అధికార బీఆర్‌ఎస్‌ను ఇరుకున పెట్టాలని భావిస్తోంది.

సన్నాహక సమావేశాలు

ఈ బస్సు యాత్రను విజయవంతం చేసేందుకు పార్టీ సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే జిల్లా స్థాయి ముఖ్యనేతలతో రాష్ట్ర నాయకత్వం సమావేశం నిర్వహించింది. నియోజకవర్గాల్లో ప్రతి రెండు మండలాలకు ఒక జిల్లా నాయకులను ఇన్‌చార్జీలుగా నియమించింది. మరోవైపు నియోజకవర్గాల వారీగా సమావేశాలను నిర్వహిస్తోంది.


శ్రేణుల్లో ఎన్నికల ఉత్సాహం

ఈ యాత్ర ద్వారా బీజేపీ శ్రేణుల్లో ఎన్నికల ఉత్సాహం నింపాలని పార్టీ భావిస్తోంది. ఇప్పటికే అధికార బీఆర్‌ఎస్ అభ్యర్థులను ప్రకటించింది. నెల రోజులుగా వారు వివిధ సంక్షేమ కార్యక్రమాల పేరుతో నిత్యం ప్రజల్లో ఉంటున్నారు. మరోవైపు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలతో ఓటర్లను కలుస్తున్నారు. కానీ కమలంలో మాత్రం ఆ తరహా ఉత్సాహం కనిపించడం లేదని తెలుస్తోంది. ఈ యాత్ర ద్వారా శ్రేణులను ఎన్నికలకు సమాయత్తం చేసినట్లు అవుతుందని భావిస్తోంది.

సెల్ఫీ విత్ గణేశ్

మీరు విఘ్నేశ్వరుడిని ప్రత్యేక ఆకృతుల్లో ప్రతిష్ఠించారా.. పర్యావరణాన్ని కాపాడే రీతిలో గానీ, ఏ అంశంపైనైనా సమాజానికి సందేశం ఇచ్చే రీతిలో మీ వినాయకుడు ఉన్నాడా.. మీ కాలనీల్లో, అపార్ట్‌మెంట్‌లలో ఏర్పాటు చేసుకున్న వినాయకుడు ఏదైనా స్పెషల్ గెటప్‌లో ఉన్నాడా.. అయితే, మీ వినాయకుడితో మీరు సెల్ఫీ తీసుకుని మాకు పంపితే.. ఆ ఫొటోలలో ఎంపిక చేసి ప్రచురిస్తాం.

మీరు సెల్ఫీ పంపాల్సిన వాట్సప్ నం.
99498 49479



గృహలక్ష్మిని వేగిరం చేయండి

కలెక్టర్‌కు సీఎస్ శాంతికుమారి ఆదేశం

సంగారెడ్డి టౌన్ : గృహలక్ష్మి పథకం అమలును వేగవంతం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కలెక్టర్‌కు సూచించారు. అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో పథకాల లబ్ధి చేకూరేలా కృషి చేయాలని సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశం మందిరంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా శరత్ మాట్లాడుతూ, ఈ పథకం కింద జిల్లాకు 14,250 ఇళ్లు కేటాయించగా, 6,846 మందికి మంజూరు చేశామన్నారు. ఇప్పటివరకు 3 వేల మందికి పంపిణీ చేసినట్లు వెల్లడించారు. మిగతా వారికి మంజూరు పత్రాల పంపిణీకి ప్రణాళిక రూపొందించుకున్నామని స్పష్టం చేశారు. వారం రోజుల్లో జిల్లాకు కేటాయించిన లక్ష్యాన్ని పూర్తి చేస్తామని వివరించారు. రుణ మాఫీ కింద జిల్లాలో ఇప్పటివరకు 80,239 మంది రైతులకు 449.11 కోట్ల రూపాయల మాఫీ జరిగిందని గుర్తుచేశారు. 40,945 మందికి కొత్తగా రూ.220 కోట్ల రుణాలు అందజేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో 3,160 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. హరితహారంలో జిల్లా లక్ష్యానికి మించి మొక్కలు నాటి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిపామని చెప్పారు.

పట్టాల పంపిణీకి ఏర్పాట్లు

- ఈనెల 30 లోగా పూర్తి చేయాలి
- అధికారులకు కలెక్టర్ శరత్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్ : జహీరాబాద్ నియోజకవర్గంలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఈనెల 30 లోపు లబ్ధిదారులకు అందించేందుకు సిద్ధం చేయాలని కలెక్టర్ శరత్ జిల్లా అధికారులను ఆదేశించారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి సంబంధించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ కులాలకు సంబంధించి కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి భూమి కేటాయింపు, ఇంటి పట్టాల పంపిణీకి ఏర్పాట్లు చేయాలన్నారు. రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని ఆర్డీఓ వెంకారెడ్డికి సూచించారు. జహీరాబాద్, మొగుడంపల్లి, నాల్‌కల్, ఝరాసంగం మండలాల్లోని నాలుగు గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఈ రఘువీర్‌కు సూచించారు. మైనార్టీ బంధు చెక్కులను లబ్ధిదారులకు అందజేయడానికి సిద్ధం చేయాలని జిల్లా మైనార్టీ అధికారి దేవుజాకు చెప్పారు. ఝరాసంగం మండలం, బిడేకన్నె గ్రామంలో మంజూరైన 52 కమ్యూనిటీ బోర్లను ప్రారంభించడానికి సిద్ధం చేయాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారికి తెలిపారు. హార్టికల్చర్ ప్లాంటేషన్ జరిగేలా చర్యలు చేపట్టాలని ఉద్యాన శాఖ డీడీ వెంకటేశ్వర్లును ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, ఈఈలు, డీఈ లు, మున్సిపల్ కమిషనర్ మల్లారెడ్డి, సంగారెడ్డి, జహీరాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారులు పాల్గొన్నారు.

కదంతొక్కిన అంగన్‌వాడీలు

- నిర్బంధాన్ని సహించబోమని స్పష్టీకరణ
- పట్టణంలో భారీ ర్యాలీ



ధర్నాలో అంగన్‌వాడీలు

సంగారెడ్డి టౌన్: అంగన్వాడీల సమ్మెపై ప్రభుత్వ నిర్బంధ కాండను తక్షణమే ఆపాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు డిమాండ్ చేశారు. బుధవారం పీఎస్ఆర్ గార్డెన్ నుంచి కలెక్టర్ ఆఫీస్ వరకు భారీ ర్యాలీ చేరుకొని ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అంగన్వాడీలను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం ఇవ్వాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్‌కు రూ.10 లక్షలు, ఆయాకు రూ.ఐదు లక్షలు ఇవ్వాలని వివరించారు. 70 వేల మంది పది రోజుల నుంచి సమ్మె చేస్తుండగా సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడటం సరికాదన్నారు. 1926 చట్ట ప్రకారం 14 రోజుల ముందే నోటీసు ఇచ్చి శాంతియుతంగా సమ్మె చేస్తున్నామని వెల్లడించారు. అంతేకాకుండా అంగన్వాడీ కేంద్రాల తాళాలను పగలగొట్టి సమ్మె విచ్ఛిన్నానికి సర్కారు పాల్పడుతోందని మండిపడ్డారు. 40 సంవత్సరాలుగా ఐసీడీఎస్‌లో పనిచేస్తున్నా గానీ నేటికీ కనీస వేతన విధానం లేదన్నారు. ప్రభుత్వ సర్వేలు చేస్తున్నారని, పథకాలను ప్రజలకు అందేలా కృషి చేస్తున్నారని గుర్తుచేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం సంఘాలతో చర్చించి సమ్మెను సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. అనంతరం డీఆర్‌ఓ నగేశ్ హామీతో ఆందోళనను విరమించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మల్లేశం, సాయిలు నాయకులు రాజయ్య, నరసింహారెడ్డి, యాదగిరి, ప్రవీణ్, అంగన్వాడీ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు శశికళ, మంగ, ఉద్యోగులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



వైభవంగా సామూహిక కుంకుమార్చన

నారాయణఖేడ్‌లో లలిత వైభవం ట్రస్టు ఆధ్వర్యంలో పరమహంస రాజు గృహ ఆవరణలో బుధవారం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఆపై సామూహిక కుంకుమార్చనలు, లలిత సహస్ర పారాయణాన్ని గావించారు. స్వామి కల్యాణోత్సవం గురించి పురోహితులు, భక్తులకు వివరించారు.

-నారాయణఖేడ్



అర్ధనగ్న ప్రదర్శన

సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద నిరవధిక సమ్మె చేస్తున్నారు. 17వ రోజైన బుధవారం ఉద్యోగులు అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలిపారు. ప్రతి ఉద్యోగికి జీవిత బీమా, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు శేషాద్రి డిమాండ్ చేశారు. మాజీ మంత్రి బాబుమోహన్, ప్రజాసంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు.

-సంగారెడ్డి టౌన్

సంక్షేమ పథకాలు లబ్ధిదారుల దరిచేర్చాలి

ఎమ్మెల్యే జగ్గారెడ్డి

సంగారెడ్డి మున్సిపాలిటీ : దళిత బంధు, బీసీ బంధు, మైనారిటీ బంధు పథకాలను అర్హులైన వారికి అందించాలని సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ శరత్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గంజి మైదాన మార్కెట్‌లో నిర్మించిన 35 షాపులను లబ్ధిదారులకు వెంటనే కేటాయించాలన్నారు. బొబ్బిలికుంట చెరువు వల్ల నష్టపోయిన కుటుంబాల వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు లేదా నష్టపరిహారం ఇవ్వాలని సూచించారు. రాజంపేటలో ఓం శాంతి బిల్డింగ్ కోసం 400 గజాల స్థలం కేటాయించాలని తదితర నియోజకవర్గంలోని అనేక సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి పనుల గురించి కలెక్టర్‌తో చర్చించారు. ఆయన వెంట అనంత కిషన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

గాయత్రి బయో కంపెనీలో అగ్నిప్రమాదం



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

పటాన్‌చెరు టౌన్ : గాయత్రి బయో కంపెనీలో స్వల్ప అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. బుధవారం తెల్లవారుజాము రెండు గంటల సమయంలో పొగ వచ్చి, మంటలు వ్యాపించాయి. దీంతో ఐదుగురు కార్మికులు ఆర్పే ప్రయత్నం చేశారు. ఆపై అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో పటాన్‌చెరు, పాశమైలారం ఫైరింజన్‌లు ఘటన స్థలానికి చేరుకొని రెండు గంటలు శ్రమించి పూర్తిగా ఆర్పేశారు. మండలంలోని భానూరు నుంచి క్యాసారం వెళ్లే దారిలో ఉన్న ఈ కంపెనీ మాస్క్ బికెట్ తయారీ చేస్తోంది. ఈ ఘటన పై బీడీఎల్ పోలీసుల వివరణ కోరగా ఫిర్యాదు రాలేదన్నారు.

పోలీస్ సిబ్బందికి అభినందనలు

సంగారెడ్డి అర్బన్: బీడీఎల్ భానూర్ పెట్రోలింగ్ ఎస్ఐ శివకుమార్, అవుట్ పోస్ట్ ఎస్ఐ మహ్మద్ అలీ, సిబ్బందిని ఎస్పీ రమణకుమార్ అభినందించారు. గాయత్రి బయో కంపెనీ ప్రమాద ఘటన జరిగిన వెంటనే 100 డయల్ కాల్ సమాచారం రాగా వారు వేగంగా స్పందించారు. ఘటన స్థలానికి చేరుకొని కంపెనీలో నివసిస్తున్న 50 కుటుంబాలను ఖాళీ చేయించారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి భిక్షపతి



దీక్ష చేస్తున్న నాయకులు

జహీరాబాద్ టౌన్: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్ర భిక్షపతి రాజకీయ నాయకులను కోరారు. జిల్లా కన్వీనర్ అబ్రహం మాదిగ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపడుతున్న నిరాహార దీక్ష బుధవారానికి ఎనిమిదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా శిబిరాన్ని సందర్శించి ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామన్న బీజేపీ పార్లమెంట్‌లో బిల్లు పెట్టకుండా కాలయాపన చేస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశాల్లో రాజకీయ పార్టీలు ఒత్తిడి తీసుకు రావాలని కోరారు. కార్యక్రమంలో జయరాజ్, సుకుమార్, జానీ, హేమనంద్, సన్నీ, పరమేశ్, మహిపాల్, సుందర్, శ్యాం, సునీల్ తదితరులు పాల్గొన్నారు. తొలుత పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్రధాన రహదారి గుండా ర్యాలీ కొనసాగింది. అనంతరం ప్రధాన కూడలి, అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు.

జిల్లాస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

నారాయణఖేడ్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి పోటీలకు ఖేడ్ మండలం జూకల్ శివారులోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకులానికి చెందిన 30 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ లక్ష్మాగౌడ్ బుధవారం తెలిపారు. ఇటీవల పెద్దశంకరంపేటలో మండలస్థాయిలో నిర్వహించిన ఖోఖో, వాలీబాల్, కబడ్డీ అండర్–14, అండర్ –17 విభాగాల్లో ప్రతిభ చూపారని పేర్కొన్నారు.

కోర్టు స్టోర్ రూంలోని గంజాయి మాయం

సంగారెడ్డి అర్బన్: కోర్టు స్టోర్ రూంలో ఉన్న గంజాయి మాయమైన ఘటన పట్టణంలో జరిగింది. జిల్లా కోర్టులో గదిలో పెట్టిన గంజాయిని తెలియని వ్యక్తులు అపహరించినట్టు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్నామని పేర్కొన్నారు.

నేటి నుంచి సిటీ పోలీస్ యాక్ట్

సిద్దిపేటకమాన్: పోలీస్ కమిషనరేట్ పరిధిలో నేటి నుంచి సిటీ పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని సీపీ శ్వేత తెలిపారు. ఈనెల 28వ తేదీ వరకు ఈ నిబంధనలు అమలులో ఉంటాయని తెలిపారు. ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ధర్నాలు నిర్వహించరాదని సీపీ సూచించారు.

క్లుప్తంగా

అదుపు తప్పిన బైక్, యువకుడి మృతి


నవీన్

పటాన్‌చెరు టౌన్: బైక్ అదుపు తప్పి కింద పడి తీవ్రగాయాలైన యువకుడు మృతిచెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన నవీన్ (26) పెయింటర్ పని చేసుకొని జీవిస్తున్నాడు. ఈనెల 15న స్కూటీపై సంగారెడ్డి నుంచి పటాన్‌చెరు వెళ్లనకు వస్తున్నాడు. లక్డారం చౌరస్తా సమీపాన రాగానే వాహనం అదుపు తప్పి కిందపడగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం ఈనెల 16న గాంధీకి తరలించారు. అక్కడ అతను చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతిచెందాడు. కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పాము కాటుతో గేదె మృతి


గేదె కళేబరం

కల్హేర్(నారాయణఖేడ్): పాము కాటుతో గేదె మృతిచెందిన సంఘటన నిజాంపేట మండలం రాంరెడ్డిపేటలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన రైతు షాదుల్‌కు చెందిన పశువులు గ్రామ శివారులో మేపుతున్నాడు. అందులోని ఒక గేదె పాము కాటుకు గురైంది. విలువ రూ. 85 వేల వరకు ఉంటుందని బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం నుంచి పరిహారం ఇప్పించాలని అధికారులను కోరాడు.

సైకోలా ప్రవర్తించి..

భార్యపిల్లల ముందు విషం తాగి..

- భర్త ఆత్మహత్య
- బ్యాతోల్‌లో ఘటన


పోచయ్య

హవేళీఘణాపూర్(మెదక్): సైకోలా ప్రవర్తించిన భర్త, భార్యపిల్లల ముందు కూర్చోబెట్టుకున్నాడు. విషం తాగుతున్నానని అడ్డుకుంటే కత్తితో పొడుస్తానని బెదిరించి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలపరిధిలోని బ్యాతోల్‌లో బుధవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మంగళి పోచయ్య(42) కొంతకాలంగా మద్యం తాగి తరుచుగా కుటుంబీకులతో గొడవలు పడేవాడు. సైకోగా మారిన అతను ఈనెల 18న సోమవారం రాత్రి భార్య, కుమారుల ఎదుట పురుగుల మందు తాగి, అడ్డుకుంటే కత్తితో పొడుస్తానంటూ బెదిరించాడు. దీంతో ఎవరు దగ్గరకు వెళ్లలేదు. అపస్మారక స్థితికి వెళ్లపోయిన అతడిని వెంటనే మెదక్ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గాంధీకి తీసుకెళ్లారు. ఇక్కడ రెండు రోజులుగా చికిత్సపొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందినట్లు కుటుంబీకులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చందాపూర్‌లో ఉద్రిక్తత

- క్షుద్ర పూజలు చేస్తున్నారని ఇద్దరిని చితకబాదిన గ్రామస్తులు
- పోలీస్‌స్టేషన్‌కు తరలింపు

చిన్నశంకరంపేట(మెదక్): క్షుద్రపూజలు చేస్తున్నారని ఇద్దరు వ్యక్తులను చితకబాదిన సంఘటన మండల పరిధిలోని చందాపూర్ గ్రామంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ప్యార చంద్రయ్య, పోతరాజ్ రాములు గ్రామ పొలిమెరలో నిమ్మకాయలు, పసుపు, కుంకుమ, కొబ్బరికాయలతో క్షుద్రపూజలు చేస్తున్నారని ఓ యువకుడు గ్రామస్తులకు సమాచారం ఇచ్చాడు. దీంతో ఘటనాస్థలానికి చేరుకొని వారిని చితకబాదారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో బంధించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీస్‌లు వచ్చి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

నేటి నుంచి కళా ఉత్సవ్

ముస్తాబైన వర్గల్ నవోదయ విద్యాలయం

వర్గల్(గజ్వేల్): రాష్ట్రంలోని నవోదయ విద్యాలయాల క్లస్టర్ స్థాయి కళా ఉత్సవ్ 2023–24 సమ్మేళనానికి సిద్దిపేట జిల్లా వర్గల్ నవోదయ విద్యాలయం ముస్తాబైంది. విద్యార్థుల కళా నైపుణ్యాల ప్రదర్శనకు వేదికగా ఈనెల 21 గురువారం నుంచి రెండు రోజుల పాటు సంగీత, నృత్య, ఆర్ట్, డ్రాయింగ్ తదితర 10 రకాల పోటీలు జరగనున్నాయి. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజియన్ సహాయ కమిషనర్ అభిజిత్ బెరా హాజరవుతారని ప్రిన్సిపాల్ రాజేందర్ తెలిపారు.

పూర్తయిన ఏర్పాట్లు

కళా ఉత్సవ్‌కు ఎంపీ హాల్, ఫిజిక్స్, బయోలజీ ల్యాబ్, ఓపెన్ ప్లేస్‌ను సిద్ధం చేశారు. పోటీలకు ఆతిథ్యమిస్తున్న ఉమ్మడి మెదక్ జిల్లా వర్గల్ నవోదయ, ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్, మహబూబ్‌నగర్, నల్గొండ, నిజామాబాద్, రంగారెడ్డి జిల్లాల నుంచి దాదాపు 150 మంది బాల బాలికలు ఇందులో భాగస్వాములు కానున్నారు. శాస్త్రీయ సంగీతం, కర్ణాటక, హిందుస్తానీ, జానపద, గాత్ర సంగీతం, వాద్య సంగీతం, శాస్త్రీయ, జానపద నృత్యం, డ్రాయింగ్, పెయింటింగ్, శిల్పకళ (మట్టితో బొమ్మలు తయారుచేయడం), ఏకపాత్రాభినయం తదితర అంశాల్లో పోటీలు కొనసాగుతాయి. ఇందులో అత్యుత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులను రీజినల్ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని ప్రిన్సిపాల్ రాజేందర్ పేర్కొన్నారు.


వర్గల్ నవోదయ విద్యాలయం



సాధన చేస్తున్న విద్యార్థినులు

వార్తలు రాస్తే బూతులు తిడుతారా..?

- అధికారమదంతోనే సాక్షి విలేకరిపై దాడి
- అల్లాదుర్గం ఎంపీపీని అరెస్టు చేయాలి
- జర్నలిస్టు సంఘాల డిమాండ్

హవేళీఘణాపూర్(మెదక్): అల్లాదుర్గం సాక్షి విలేకరి వీరేందర్‌పై ఎంపీపీ అనిల్‌కుమార్‌రెడ్డి దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని మెదక్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు దొంతి నరేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింహాచారి, ఆర్గనైజింగ్ సెక్రటరీ రియాజ్ పేర్కొన్నారు. బుధవారం మెదక్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ ప్రజా సమస్యలను వెలికితీసే జర్నలిస్టును అధికారమదంతో దాడికి పాల్పడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. అందిన సమాచారాన్ని బట్టి వార్తలు రాస్తే దుర్భాషలాడుతారా అని ప్రశ్నించారు. ఒకవేళ వార్తలో తప్పుంటే ఖండించాల్సిందిపోయి భౌతిక దాడులకు దిగడం సరైందికాదన్నారు. చంటి క్రాంతికిరణ్ జర్నలిస్టు నాయకుడిగా ఉండి ఎమ్మెల్యే స్థాయికి ఎదిగినా నియోజకవర్గంలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ఎంపీపీ అనిల్‌కుమార్‌రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని, పదవి నుంచి బర్తరఫ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. హత్యాయత్నం కేసు నమోదు చేసి జైలుకు పంపాలన్నారు. లేకుంటే జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మెదక్ ప్రెస్‌క్లబ్ నాయకులు రాజశేఖర్, బీవీకే రాజు, ప్రకాష్, చింతల రమేశ్, రహమత్, చంద్రశేఖర్ గౌడ్, మువ్వ నవీన్, శ్రీని వాసచారి, లక్ష్మీనారాయణ, కార్తీక్, రఘు, దుర్గేష్, నర్సింలు, వంశీ, శ్రీకాంత్, నవీన్‌రెడ్డి, ఊశయ్య, కృష్ణమూర్తి, సాయిలు, హమీద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అండతోనే దాడి

దౌల్తాబాద్(దుబ్బాక): అల్లాదుర్గం సాక్షి విలేకరి వీరేందర్‌పై దాడి చేసిన ఎంపీపీ అనిల్‌రెడ్డిని తక్షణమే అరెస్టు చేయాలని దౌల్తాబాద్ ప్రెస్‌క్లబ్ సభ్యులు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ అండతోనే ఎంపీపీ అనిల్‌రెడ్డి దాడి చేశారన్నారు. పోలీసులు ఎంపీపీపై చర్యలు తీసుకోకపోతే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆందోళ చేస్తామని హెచ్చారించారు. కార్యక్రమంలో దౌల్తాబాద్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రాజిరెడ్డి, ప్రెస్‌క్లబ్ సభ్యులు శంభులింగం, సంతోష్, నగేష్, బాబు, భాస్కర్ గౌడ్, యాదగిరి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దౌల్తాబాద్ ప్రెస్‌క్లబ్ సభ్యులు

టేక్మాల్‌లో ర్యాలీ

టేక్మాల్(మెదక్): అల్లాదుర్గం విలేకరిపై దాడిని ఖండిస్తూ బుధవారం టేక్మాల్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నల్లాబడ్జీలు ధరించి ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఎంపీపీ అనిల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తహసీల్దార్ మల్లయ్యకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ.. అధికారమదంతో జర్నలిస్టులపై దాడులు చేయడం అమానుషమన్నారు. కార్యక్రమంలో టేక్మాల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు బాగయ్య, సీనియర్ పాత్రికేయులు ఆనంద్, మహేదర్‌రెడ్డి, బీరప్ప, నర్సింలు, పులిరాజు, ధనుంజయ, రాజు, రమేష్, నాయికోటి రాజు, సాయిలు, ప్రేమ్‌కుమార్, నరేందర్, రాము, అశోక్, కుమార్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు


అలీం

రేగోడ్(మెదక్): అల్లాదుర్గం సాక్షి విలేకరి వీరేందర్‌పై దాడి చేసిన ఎంపీపీ అనిల్‌రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని నారాయణఖేడ్ ప్రెస్‌క్లబ్ గౌరవ అధ్యక్షుడు అలీం బుధవారం డిమాండ్ చేశారు. చట్టాన్ని తన చేతుల్లోకి తీసుకొని దాడులకు పాల్పడడం అప్రజాస్వామ్యమన్నారు. జర్నలిస్టుపై దాడులు చేయడం.. బెదిరించడం రాజకీయ నాయకులకు ఫ్యాషన్‌గా మారిందన్నారు.

అల్లాదుర్గంలో...

జర్నలిస్టులపై అధికార పార్టీ నాయకుల దాడులు సహించేది లేదని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు బలరాం, బీజేపీ జిల్లా నాయకుడు బ్రహ్మం హెచ్చరించారు. బుధవారం తహసీల్దార్ సతీశ్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. అల్లాదుర్గం ఎంపీపీ అనిల్ కుమార్ రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. నాలుగున్నరేళ్లగా ఎంపీపీగా ఉన్న మీరు అల్లాదుర్గంకు ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దుర్గయ్య, వైఎస్సార్సీపీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు నరేష్ నాయకులు సదానందం,, కేశనాయక్, వంకిడి రాములు, సాయిబాబా, వీరబోయిన సాయిలు, ముసిరిగారి శ్రీను, నితీశ్, లక్ష్మణ్, రాజు ఉన్నారు.


టేక్మాల్ తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న జర్నలిస్టులు


మాట్లాడుతున్న మెదక్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు నరేశ్, సభ్యులు

మహిళ ఆత్మహత్య

గజ్వేల్‌రూరల్: అనారోగ్య సమస్యలు తాళలేక ఓ మహిళ పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని పిడిచెడ్‌లో చోటు చేసుకుంది. గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బీమనమైన లక్ష్మి(36)–సాయిలు దంపతులకు ఇద్దరు కుమారులు. లక్ష్మి కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. ఈ క్రమంలో బుధవారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. వెంటనే కుటుంబీకులు నగరంలోని ఓ ప్రైవే టు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లి..

విద్యుదాఘాతంతో రైతు మృతి

సంగారెడ్డి మున్సిపాలిటీ : పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లిన రైతు విద్యుదాఘాతంతో మృతిచెందిన సంఘటన చౌటకూర్ మండలంలో బుధవారం ఆలస్యంగా వెలుగుచూసింది. పుల్కల్ ఎస్‌ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. చక్రియాల గ్రామానికి చెందిన వడ్డె రామ్‌దాసు తన ఇద్దరు కొడుకుల వద్ద కాకుండా (65) ఒంటరిగా ఉంటున్నాడు. ఈనెల 16న పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లాడు. స్టార్టర్ బాక్స్ సరిచేస్తుండగా తెగిన కరెంట్ తీగ తగలి అక్కడికక్కడే చనిపోయాడు. ఆయన కోసం కుమారులు వెతుకుతుండగా వ్యవసాయ పొలం వద్ద విగతజీవిగా కనిపించాడు. వారిచ్చిన సమాచారం మేరకు ఘటన స్థలానికి పోలీసులు చేరుకున్నారు. మృతిచెంది నాలుగు రోజులు కాగా మృతదేహం కుళ్లిపోయింది. దీంతో అక్కడే పోస్టుమార్టం జరిగింది. కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


రాందాస్ మృతదేహం

అవమానం భరించలేక యువకుడి ఆత్మహత్య

నర్సాపూర్ రూరల్: అవమానం భరించలేక ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చైతన్యపురి కాలనీలో చోటచేసుకుంది. ఎస్‌ఐ శివకుమార్ కథనం ప్రకారం.. చైతన్యపురి కాలనీకి చెందిన కొర్ర జగన్(21) చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాలనీకి చెందిన రషీద్ తన స్నేహితులతో కలిసి కొర్ర జగన్‌కు ఓ మహిళతో వివాహేతర సంబంధం అంటగట్టి బెదిరించాడు. దీంతో అవమానానికి గురైన జగన్,, తీవ్ర మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు.

కొర్ర జగన్‌ను హత్య చేశారు

తమ కుమారుడిని హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని జగన్ తండ్రి రాములు ఆరోపించారు. గ్రామస్తులతో కలసి మృతుడి కుటుంబ సభ్యులు పోస్టుమార్టం గది వద్ద ఆందోళనకు దిగారు. ఎస్‌ఐ వారిని సముదాయించారు. అన్ని కోణాల్లో విచారణ జరిపించి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.


కొర్ర జగన్


ఆందోళనకు దిగిన మృతుడి కుటుంబ సభ్యులు, కాలనీవాసులు

సంక్షేమ పథకాలను సమర్థంగా అమలు చేయండి


వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ తదితరులు

సిద్దిపేటరూరల్: సంక్షేమ పథకాలను సమర్థంగా సకాలంలో అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారం వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు రైతు రుణమాఫీ, ఎరువుల లభ్యత, ఆసరా పింఛన్, ఇంటి పట్టాల పంపిణీ, గృహలక్ష్మి , హరితహారం, పంచాయతీ భవనాల నిర్మాణం, హరితహారం, ఆయిల్ పామ్ వంటి పలు అంశాలపై జిల్లా కలెక్టర్‌కు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్, డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్య, డీఎఫ్ఓ శ్రీనివాస్, డీఏఓ శివప్రసాద్, డీహెచ్ఓ సునీత, లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యజిత్ తదితరులు, పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం


అఖిల

కొండపాక(గజ్వేల్): వివాహిత అదృశ్యమైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. త్రీటౌన్ సీఐ భాను ప్రకాశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని దుద్దెడకు చెందిన వివాహిత గడ్డం అఖిల(22) ఈనెల 19న ఉదయం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అంతటా వెతికినా ఆచూకి లభించలేదు. రెండు నెలలుగా దుద్దెడ శివారులో రైల్వే ట్రాక్ నిర్మాణ పనుల నిమిత్తం కూలీకి వెళ్తున్నట్లు తెలిపారు. యువతి తల్లి పుష్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యా వ్యవస్థపై ప్రభుత్వ నిర్లక్ష్యం


మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

సిద్దిపేటరూరల్: విద్యా వ్యవస్థపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపట్టిన రిలే దీక్షలకు బుధవారం మద్దతు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అగ్రవర్ణాల చదువుపై ప్రభుత్వం చొరవ చూపడం వల్లే నేడు విద్యా వ్యవస్థ కుంటుపడిందని వాపోయారు. ఓయూలో 900 టీచర్ల ఖాళీలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థుల వల్ల తెలంగాణ ఏర్పడితే, సీఎం అయ్యాక కేసీఆర్ కాళేశ్వరం ఫైల్ మీద సంతకం పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఐకేపీ ఉద్యోగుల మాదిరిగా సమగ్ర శిక్షా ఉద్యోగులను కూడా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేస్తే రూ. 500 కోట్ల భారం పడుతుందని ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. జీతం ఎక్కువై ఉద్యోగులు సమ్మె చేస్తున్నారని సోషల్ మీడియా ద్వారా తప్పుడు చేస్తున్నారని వాపోయారు. వచ్చే ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌ను పదవి నుంచి తప్పించాలని కోరారు. దళితుల భూములు ఆక్రమించి సిద్దిపేట కలెక్టరేట్ కట్టారని విమర్శించారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు, సమగ్ర శిక్షా ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు తప్పనిసరి

బెజ్జంకి(సిద్దిపేట): పక్కా అనుమతులతోనే ఇంటి నిర్మాణాలు చేపట్టాలని లోకాయుక్త విచారణాధికారి మధ్యూకోశి స్పష్టం చేశారు. బెజ్జంకి మండల కేంద్రంలోని రోడ్డు స్థలంలో అక్రమ నిర్మాణం చేపడుతున్నారని ఉప్పలేటి బాబు లోకాయుక్తలో ఇటీవల ఫిర్యాదు చేశారు. దీనిపై బుధవారం ఆయనతో పాటు డీపీఓ దేవకీదేవి, సిద్దిపేట, హుస్నాబాద్ డీఎల్‌పీఓ మల్లికార్జున్‌రెడ్డి, వీరభద్రయ్యలతో కలిసి సంబంధిత ఇంటి నిర్మాణాన్ని పరిశీలించారు. పూర్వపు రోడ్డు స్థలంలో నిర్మాణం జరిగిందని నిర్ధారించి కొంత భాగాన్ని తొలిగించారు. మిగతా స్థలాన్ని ఆర్అండ్‌బీ అధికారులతో గుర్తించాక పూర్తి స్థాయిలో చర్యలు తీసుకునేందుకు లోకాయుక్తకు నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకట్‌రెడ్డి, ఎంపీడీఓ రాము, ఎంపీఓ విష్ణు, కార్యదర్శి ప్రణీత్‌రెడ్డి పాల్గొన్నారు.

పంట మార్పిడి ఎంతో మేలు

సిద్దిపేటరూరల్: పంటలు సాగు చేసే రైతులు పంటల మార్పిడి, పచ్చిరొట్ట ఎరువులను వినియోగించడంతో పంటలను రక్షించుకునేందుకు అవకాశం ఉంటుందని వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డాక్టర్ రఘు రామి రెడ్డి రైతులకు సూచించారు. బుధవారం మండల పరిధిలోని ఇర్కోడ్, నారాయణరావుపేట మండల పరిధిలోని ఇబ్రహీంపూర్ గ్రామాల్లోని రైతులతో చర్చాగోష్టి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘు రామిరెడ్డి, మండల సహ సంచాలకులు ఉమారెడ్డి ముఖ్య అతిథిలుగా హాజరై మాట్లాడారు. నేల ఆరోగ్యం సంరంక్షించేందుకు పచ్చి రొట్టి ఎరువులను సాగు చేయాలని తెలిపారు. పంట మార్పిడి పద్ధతిని అవలంబించాలన్నారు. అలాగే తగిన మోతాదులో ఎరువులను వాడాలని సూచించారు. వరి పంటలో మొగి పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. కార్యక్రమంలో తోర్నాల పరిశోధనా స్థానం సీనియర్ శాస్త్రవేత్త శ్రీదేవి, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త విజయ్, శ్రీజయ, రమాదేవి, ఉమారాణి, శ్వేత, పల్లవి, సరితలు పాల్గొన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారి నాగార్జున, సర్పంచ్ దేవయ్య, రైతు బంధు సమితి అధికారి నగేష్ మరియు ఇతర రైతులు పాల్గొన్నారు.

కేసీఆర్‌కే మా మద్దతు

గజ్వేల్: గజ్వేల్ నుంచి ముచ్చటగా మూడోసారి పోటీ చేస్తున్న సీఎం కేసీఆర్‌కు సంపూర్ణ మద్దతును ప్రకటించి లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపిస్తామని గజ్వేల్‌లోని తంజీముల్ మసాజిత్ కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈమేరకు బుధవారం కమిటీ నాయకులు, ప్రతినిధులు ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డితో కలిసి సిద్దిపేటలో మంత్రి హరీశ్‌రావుకు తీర్మాన కాపీని అందజేశారు. ఈసందర్భంగా మంత్రి కమిటీ నేతలను అభినందించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు సయ్యద్ యూసుఫొద్దీన్, హజ్ కమిటీ డైరెక్టర్ జాఫర్‌ఖాన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు విరాసత్ అలీ, పట్టణ శాఖ అధ్యక్షుడు నవాజ్‌మీరా, కౌన్సిలర్ ఎంఏ రహీం, నాయకులు సమీర్, ఉమర్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు. కాగా గజ్వేల్ మండలం దాచారం గ్రామ ముదిరాజ్ సంఘం నాయకులు సైతం కేసీఆర్‌కు మద్దతు ప్రకటించిన తీర్మానాన్ని మంత్రి హరీశ్‌రావుకు అందజేశారు.


మంత్రి హరీశ్‌రావుకు తీర్మాన ప్రతిని అందజేస్తున్న నాయకులు

వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి


ఢిల్లీలో జరిగిన మహాధర్నాలో గజ్వేల్ నేతలు

గజ్వేల్: ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణ బిల్లుకు ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో చట్టబద్ధత కల్పించే దిశగా చర్యలు చేపట్టాలని మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఎంఈఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేబర్తి యాదగిరి మాదిగ డిమాండ్ చేశారు. వర్గీకరణ డిమాండ్‌తో బుధవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన మహాధర్నాలో గజ్వేల్ నుంచి మాదిగ ఉద్యోగులు, విద్యావంతులు పాల్గొన్నారు. ఈసందర్భంగా యాదగిరి మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చిన బీజేపీ ఇప్పటికైనా మాటను నిలబెట్టుకోవాలని కోరారు. ఆయనతో పాటు మహాధర్నాలో గజ్వేల్‌కు చెందిన ఎంఈఎఫ్, ఇతర సంఘాల నాయకులు మరాటి కృష్ణమూర్తి, సంతోష్, జోగు రవికుమార్, నవజీవన్, తదితరులు పాల్గొన్నారు.

నువ్వా నేనా!


ఎంపీడీఓ కార్యాలయం

- ఎంపీడీఓలు వర్సెస్ ప్రజాప్రతినిధులు
- నాలుగేళ్లలో నలుగురు అధికారుల బదిలీ
- ఆసరా పింఛన్లు, గృహలక్ష్మి లబ్ధిదారుల ఎంపికే కారణం?

హుస్నాబాద్‌రూరల్: మండల అధికారులకు కొంతమంది ప్రజాప్రతినిధులకు పడటం లేదు. ఎంపీడీఓ కార్యాలయం కొత్త భవనంలోకి వెళ్లి నాలుగేళ్ల సమయంలో నలుగురు ఎంపీడీఓలు దమ్మని రాము, సత్యావతి, జయశీల, అనిత బదిలీ అయ్యారు. గృహలక్ష్మి, ఆసరా పింఛన్లు తెచ్చిన పంచాయితీలు.. బదిలీ కావడానికి ఓ కారణమని సిబ్బంది వాపోతున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడానికి అధికారులు కృషి చేస్తున్నారు. కానీ తమ పనులు చేయని అధికారిని బదిలీ చేయాలని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ దృష్టికి కొందరు ప్రజాప్రతినిధులు తీసుకెళ్లారు. ఆయన ఈ విషయమై జెడ్పీసీఈఓకు సమాచారం ఇచ్చారని తెలిసింది. అంతేకాకుండా ఎంపీడీఓ కార్యాలయంలో ఉండాల్సిన సూపరింటెండెంట్ పోస్టును అక్కన్నపేటకు ఇచ్చారు. దీంతో ఇక్కడ సీనియర్ అసిస్టెంట్లు అజమాయిషీ చెలాయిస్తున్నారు. అక్కన్నపేట ఎంపీడీఓ కార్యాలయానికి పూర్తి స్థాయి సిబ్బంది వచ్చినందున సూపరింటెండెంట్‌ను హుస్నాబాద్‌కు తీసుకురావాలని, అలాగే ప్రస్తుత ఎంపీడీఓ విధుల్లో చేరేలా చర్యలు తీసుకోవాలని ఇంకొందరు ప్రజాప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.

సెలవులో వెళ్లిన ఎంపీడీఓ, ఇన్‌చార్జ్ ఎంపీఓ

గృహలక్ష్మి పథకంలో దరఖాస్తుదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నారని, ఆసరా పింఛన్లు మంజూరులో జాప్యం చేస్తున్నారని ప్రజాప్రతినిధులు ఆరోపిస్తున్నారు. నిబంధనల ప్రకారం పింఛన్ల, గృహలక్ష్మి దరఖాస్తులను పరిశీలించామని, అర్హులకే వచ్చేలా క్షేత్రస్థాయి సర్వే చేసి ఆన్‌లైన్ చేసినట్లు హుస్నాబాద్ ఎంపీడీఓ చెబుతున్నారు. మండల ప్రజాప్రతినిధి అర్హత లేని వారికి లబ్ధి చేకూర్చాలని ఒత్తిడి తేవడంతోనే కొన్ని దరఖాస్తులను తిరస్కరించినట్లు సమాచారం. ఈనెల 7న ఎంపీడీఓ సెలవులో వెళ్లడంతో ఎంపీఓ సత్యనారాయణకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఆయన కూడా ఆరోగ్య సమస్యలతో వారం రోజులు సెలవుపై వెళ్లారు. ఎంపీడీఓ విధుల్లో చేరుతారా? కొత్తగా ఎవరైన వస్తారా? అనేది వేచిచూడాలి.

క్లుప్తంగా

15 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 15 మంది వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు 15 మందికి జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సోమ, మంగళవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 15 మంది వాహనదారులను అదుపులోకి తీసుకొని బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చారు. దీంతో జడ్జి 13 మందికి ఒక్కొక్కరికి రూ.2 వేలు, మరో ఇద్దరికి రూ.3వేల చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు.

సింగితంను మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు, నాయకులు

రాయికోడ్(అందోల్): మండలంలోని సింగితం గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ సింగితం, రాయిపల్లి తదితర గ్రామాల ప్రజలు బుధవారం రాయికోడ్‌లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ సింగితం గ్రామం చుట్టూ పక్కల 25 గ్రామాలకు కేంద్ర బిందువుగా ఉందన్నారు. రాయికోడ్, ఝరాసంగం మండలాల్లోని గ్రామాలతో కలిసి సింగితంను మండల కేంద్రంగా ఏర్పాటు చేస్తే ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు శశికాంత్ పాటిల్, ప్రభాకర్, రాజు, బాలయ్య, వీరేశం, రఫిక్, మోహన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఖోఖోలో మొగుడంపల్లి విద్యార్థుల సత్తా



మెమెంటో ప్రదానం చేస్తున్న ప్రిన్సిపాల్ మాధవిలత

జహీరాబాద్ టౌన్: మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడల్లో మొగుడంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. అండర్ 14 విభాగం ఖోఖో పోటీల్లో విజేతగా నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మండల స్థాయిలో రాణించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికడంపై ప్రిన్సిపాల్ మాధవిలత, పీఈటీ భూమయ్య, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

సన్మార్గంలో నడవాలి



పీఠాధిపతి రాజేంద్రస్వామిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

మనూరు(నారాయణఖేడ్): ప్రతిఒక్కరూ సన్మార్గంలో నడవాలని కర్ణాటక రాష్ట్రంలోని ప్రసిద్ధి చెందిన మొగుల్‌కోడ్ పీఠాధిపతి మురుఘ రాజేంద్రస్వామి అన్నారు. మండల పరిధిలోని డోవ్రూర్ గ్రామంలో బుధవారం పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గురుచింతన, దైవచింతన పెద్దలను ఆరాదించడం వంటి అలవాట్లతో సమాజం శాంతియుతంగా ఉంటుందన్నారు. అంతకుముందు పీఠాధిపతిని గ్రామస్తులు పల్లకీలో ఊరేగించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి హాజరై మురుఘ రాజేంద్రస్వామిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ కొంగరి జయశ్రీమోహన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు విఠల్‌రావు, మాజీ సర్పంచ్ మారుతి, నాయకులు రాథోడ్ రవీందర్ పాల్గొన్నారు.

కల్టివేటింగ్ ఆర్ట్ కాంపిటేషన్‌లో శ్రీహిత ప్రతిభ



సంగారెడ్డి టౌన్: కేంద్ర ప్రభుత్వ సామాజిక అవగాహన కార్యక్రమాల్లో భాగంగా రాష్ట్రస్థాయి థీమ్ ఆఫ్ ఆర్ట్ కాంపిటేషన్‌లో సంగారెడ్డి పట్టణానికి చెందిన శ్రీహిత ప్రతిభ చాటింది. తెలంగాణ స్టేట్ లెవల్ ఆర్ట్ కాంపిటేషన్‌లో సిల్వర్ మెడల్ సాధించింది. సంగారెడ్డిలోని శాంతినగర్‌కు చెందిన శ్రీహిత ఓ ప్రైవేటు పాఠశాలలో 4వ తరగతి చదువుతోంది. కళలపై చిన్నారులకు ఆసక్తిని పెంచడం, పిల్లలను స్మార్ట్‌ఫోన్‌లోని వర్చువల్ గేమ్‌ల నుంచి దూరంగా ఉంచడానికి ఇలాంటి కాంపిటీషన్లు ఎంతో ఉపయోగపడతాయని నిర్వాహకులు తెలిపారు.

సమన్వయంతో పని చేయాలి

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి
- సర్వసభ్య సమావేశానికి హాజరు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు టౌన్: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. బుధవారం పటాన్‌చెరు ఎంపీపీ సుష్మాశ్రీ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా సీఎం కేసీఆర్ దళిత బంధు, గృహలక్ష్మి, మైనార్టీ బంధు, బీసీబంధు వంటి పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని తెలిపారు. పనిచేస్తేనే ప్రజాప్రతినిధులుగా సరైన ఆదరిస్తారన్నారు. ప్రజాస్వామ్యంలో పదవులు శాశ్వతం కాదని, చేసిన అభివృద్ధి పనులే శాశ్వతంగా మిగులుతాయని తెలిపారు. సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు వెంటనే సమ్మె విరమించి విధుల్లోకి చేరాలని విజ్ఞప్తి చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో మాదకద్రవ్యాల వినియోగం రోజురోజుకు పెరుగుతోందన్నారు. దీంతో ఎక్సైజ్ అధికారులు స్పందించి నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పటాన్‌చెరు జాతీయ రహదారి నుంచి పెద్దకంచెర్ల మీదుగా దౌల్తాబాద్ బ్రిడ్జి వరకు రూ.18 కోట్లతో రహదారి నిర్మాణం చేపట్టబోతున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం మంజూరు చేసిన స్పోర్ట్స్ కిట్లను త్వరలో పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ సుప్రజ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, ఎంపీడీవో బన్సీలాల్, వైస్‌ఎంపీపీ స్వప్నశ్రీనివాస్, సర్పంచులు ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేస్తున్నా శిలాఫలకాలు వేయరా?

అధికారుల తీరుపై ఎంపీపీ బాలయ్య ఆగ్రహం



వట్‌పల్లి(అందోల్): మండలంలో కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులను చేపడుతున్నా పనుల వద్ద శిలాఫలకాలు కూడా వేయరా? అంటూ ఎంపీపీ బాలయ్య అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం జోగిపేటలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు దుకాణాలను నిర్వహిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై సభ్యులు ఆసహనం వ్యక్తం చేశారు. నాదులాపూర్ గ్రామంలో ఆరు బెల్టుషాపులు కొనసాగుతున్నాయని సర్పంచ్ సత్యనారాయణ వాపోయారు. ఉపాధిహామీలో 100 రోజులు పని పూర్తి చేసుకున్న కుటుంబాల్లో పదో తరగతి పాసైన వారికి ఉన్నతి పథకం కింద ఉద్యోగ అవకాశాల కోసం పలు రంగాల్లో శిక్షణను ఇచ్చి అవకాశాలను కల్పిస్తారని ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు. జెడ్పీటీసీ ఖాదిరాబాద్ రమేష్, ఎంఈవో కృష్ణ, ఎంపీవో సౌజన్య, పీఆర్ ఏఈ మొగులయ్య, విద్యుత్ ఏఈ శ్రీనివాస్, ఆర్ అండ్‌బీ ఏఈ మనోజ్, వెటర్నరీ డాక్టర్ సంధ్యారాణి, సర్పంచ్ యాదాగౌడ్, నరేందర్‌రెడ్డి, ఎంపీటీసీలు గజేందర్‌రెడ్డి, కృష్ణాగౌడ్ పాల్గొన్నారు.

సమష్టి కృషితో పనిచేయాలి

ఎంపీపీ దేవదాసు



ఝరాసంగం(జహీరాబాద్): అధికారులు ప్రజాప్రతినిధులు సమష్టి కృషితో ముందుకెళ్తూ అభివృద్ధిని సాధించాలని ఎంపీపీ దేవదాసు అన్నారు. బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఆయా గ్రామాల్లో అడవి పందులు పంటలను ధ్వంసం చేస్తున్నాయని వివరించారు. అదేవిధంగా విద్యుత్ స్తంభాలను అవసరం ఉన్న చోట ఏర్పాటు చేయించాలని కోరారు. రేషన్ కార్డుల కోసం ఈకేవైసీ చేయించుకునేందుకు విద్యార్థులు హాస్టల్లో ఉన్నారని, వారికి గడువు పెంచాలని తెలిపారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రాత్రి సమయంలో డ్యూటీ డాక్టర్ అందుబాటులో ఉండాలని, సిబ్బంది కూడా ఒకరే ఉండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని సూచించారు. సమావేశంలో ఎంపీటీసీలు శంకర్‌పాటిల్, ఉమావతి మారుతిరావు పాటిల్, శంకరమ్మ, సంగీతగుండప్ప, విజయేందర్ రెడ్డి, రాజు, కోఆప్షన్ సభ్యుడు మహమ్మద్ ఇక్బాల్ జానీ, సర్పంచ్ సంగయ్య అధికారులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

అక్రమార్కులపై చర్యలు తీసుకోండి

హత్నూర (సంగారెడ్డి): అనుమతులు లేకుండా మొరం, ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మండల పరిధిలోని గుండ్లమాచ్నూర్ గ్రామస్తులు బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నెంబర్ 237 అసైన్డ్ భూముల్లో నుంచి కొన్ని నెలలుగా కొంతమంది వ్యక్తులు ఇసుక, మొరంను అక్రమంగా తరలిస్తున్నారు. ఈ విషయం రెవెన్యూ, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఇసుక, మొరం అక్రమ రవాణాకు పాల్పడుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి, ఉపసర్పంచ్ మన్నె శ్రీనివాస్, వార్డు మెంబర్లు శంకర్, బాల్‌రాజ్ పాల్గొన్నారు. ఆందోళనకు బీజేపీ మండల అధ్యక్షుడు నాగప్రభుగౌడ్ సంఘీభావం తెలిపారు.

హరీశ్‌రావువి మోసపూరిత మాటలు

టీపీసీసీ ఉపాధ్యక్షుడు సంజీవరెడ్డి



మాట్లాడుతున్న సంజీవరెడ్డి

నారాయణఖేడ్: మంత్రి హరీశ్‌రావువి మోసపూరిత మాటలు అని టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ సంజీవ రెడ్డి ధ్వజమెత్తారు. నారాయణఖేడ్‌లోని తన నివాసంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప ఎన్నికల నుంచి తనకు సిద్దిపేట ఒక కన్ను నారాయణఖేడ్ ఒక కన్ను అంటూ ప్రజలను మోసం చేశాడని, సిద్దిపేటకు ఎన్ని నిధులు వచ్చాయి.. నారాయణఖేడ్‌కు ఎన్ని నిధులు వచ్చాయో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఖేడ్‌లో కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ఆస్పత్రిలో బెడ్ల స్థాయి పెంచినా సరైన బెడ్లు, డాక్టర్లు, సిబ్బంది లేరన్నారు. ఓ రోగిని సంగారెడ్డికి రెఫర్ చేస్తే అత్యవసర పరిస్థితి ఉన్నా నాలుగు రోజులైనా సరైన చికిత్స అందించలేదని వాపోయారు. కర్ణాటక వాసులు ఖేడ్ వచ్చి చికిత్స పొందుతున్నారని చెబుతున్న మంత్రి కర్ణాటక జిల్లా ఆస్పత్రికి వెళ్లి పరిశీలిస్తే అక్కడి సేవలు, సౌకర్యాలు అర్థం అవుతాయని ఎద్దేవా చేశారు. కంగ్టిలో అర్హులకు దళితబంధు ఇవ్వాలని మంత్రి కాన్వాయ్‌ను అడ్డుకుంటే పోలీసులతో కొట్టించారన్నారు. ప్రజలు మంత్రి హరీశ్‌రావు మాటలు నమ్మొద్దన్నారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భోజిరెడ్డి, కౌన్సిలర్లు దారం శంకర్, రాజేష్‌నాయక్, హన్మండ్లు, సద్దాం, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



జ్యోతిని వెలిగించి క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: మానసికోల్లాసానికి క్రీడలు దోహదం చేస్తాయని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని మైత్రి క్రీడా మైదానంలో జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి పెంపొందించేలా ప్రభుత్వం ప్రతి ఏటా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ద్వారా క్రీడలు నిర్వహిస్తోందని తెలిపారు. ఐదు ఎకరాల విస్తీర్ణంతో వివిధ మండలాల్లో మినీ స్టేడియాలు నిర్మిస్తున్నామన్నారు. క్రీడల్లో ప్రతిభ చూపుతున్న క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేవిధంగా సంపూర్ణ సహకారం అందిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, ఎంపీపీలు సుష్మాశ్రీ, దేవానందం, ప్రవీణ విజయభాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీలు సుప్రజ, సుధాకర్ రెడ్డి, కుమార్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్లు పాండురంగారెడ్డి, రోజాబాల్‌రెడ్డి, లలితాసోమిరెడ్డి, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

సెల్ఫీ విత్ గణేశ్



కంది: వినాయకుడితో విమలావీరేశం



సంగారెడ్డి: గణేష్‌తో గొల్లగూడెం కాలనీవాసులు

గ్రామాల అభివృద్ధికి కృషి



శివంపేటలో పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్, జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ

సంగారెడ్డి మున్సిపాలిటీ: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే క్రాంతికిరణ్, జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ అన్నారు. బుధవారం చౌటకూర్ మండలంలోని శివంపేట, వెంకటకిష్టాపూర్, తాడ్దానిపల్లి, తదితర గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చైతన్య విజయభాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు గాజుల వీరేందర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ పటోళ్ల ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ కో ఆప్షన్ సభ్యుడు అలీం, బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి నాగులపల్లి శ్రీహరి, నాయకులు దేవుని గోపాల్, మిర్యాల రాములు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయాలి



ఆందోళన నిర్వహిస్తున్న గోవిందరాజుపల్లి గ్రామస్తులు

హత్నూర (సంగారెడ్డి): మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ మండల పరిధిలోని గోవిందరాజుపల్లి గ్రామస్తులు బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారం రోజులుగా మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఈ విషయాన్ని పలుమార్లు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే గ్రామానికి మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

సంక్షిప్త వార్తలు

◆ కమ్యూనిటీహాల్ నిర్మాణానికి శంకుస్థాపన

మనూరు(నారాయణఖేడ్): మండల పరిధిలోని మనూరు తండాలోని ఎస్టీ కమ్యూనిటీహాల్ నిర్మాణానికి ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తండాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కొంగరి జయశ్రీమోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మారుతి, నాయకులు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

◆ చట్టాలపై అవగాహన అవసరం

కంది (సంగారెడ్డి): విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు అన్నారు. బుధవారం కంది గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రమేష్ సిబ్బంది పాల్గొన్నారు.

◆ నీటి ట్యాంకర్ల అడ్డగింత

కంది(సంగారెడ్డి): అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న నీటి ట్యాంకర్లను మండల పరిధిలోని ఇంద్రకరణ్ గ్రామస్తులు బుధవారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామశివారు నుంచి అక్రమంగా నీటిని తరలిస్తున్న ట్యాంకర్లతో రహదారులు గుంతలమయంగా మారి కంకర తేలడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఈ విషయాన్ని మైనింగ్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ నీటి తరలింపును అడ్డుకొని రోడ్లు పాడవకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

◆ పరిసరాల శుభ్రత పాటించాలి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ప్రతిఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించాలని ఎంపీడీఓ పూజ అన్నారు. స్వచ్ఛతాహి సేవ పక్షోత్సవాల్లో భాగంగా బుధవారం మండల పరిధిలోని నందికంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి అంజయ్య, పంచాయతీ కార్యదర్శి రాజు, తదితరులు పాల్గొన్నారు.

◆ ఎల్‌ఎల్‌ఆర్‌లు పంపిణీ

సంగారెడ్డి మున్సిపాలిటీ: పట్టణంలోని రామ్‌నగర్‌లో పలువురు యువకులకు బీఆర్‌ఎస్ నేత చింతా ప్రభాకర్ బుధవారం ఉచిత లర్నింగ్ డ్రైవింగ్ లైసెన్స్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ 18 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరికీ లైసెన్స్‌లు పొందాలని సూచించారు. మాజీ సీడీసీ చైర్మన్ విజేందర్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కార్యదర్శి నర్సింహులు, నాయకులు జైపాల్‌రెడ్డి, సర్పంచ్ గోపాల్‌రెడ్డి, జీవి శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

◆ కల్లుగీత కార్మికులను ఆదుకోవాలి

మునిపల్లి(అందోల్): కల్లుగీత కార్మికులను ఆదుకోవాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కారదర్శి రమేశ్‌గౌడ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్‌గౌడ్ మాట్లాడుతూ కల్లుగీత వృత్తిపై ఎంతోమంది అధారపడి జీవిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం గీత కార్మికులకు సెఫ్టీ మోకులు ఇవ్వాలన్నారు. 2023, 24 సంవత్సరానికి సంబంధించి బడ్జెట్‌లో గీత కార్మికులకు కేటాయించిన నిధులను మంజూరు చేయాలని కోరారు. ఈ నెల 22న ఇందిరాపార్కు వద్ద నిర్వహిస్తున్న మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

◆ ప్రత్యామ్నాయ సేవలు

సంగారెడ్డి టౌన్: జిల్లాలోని అంగన్వాడీ ఆయాలు టీచర్లు సమ్మెలో ఉండటంతో ప్రత్యామ్నాయ మార్గంతో సేవలు కొనసాగిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారిని సంధ్యారాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు కలెక్టర్ చొరవతో గర్భిణులు, బాలింతలు చిన్నారులకు స్టేట్ హోం రేషన్ ద్వారా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.

◆ బీజేపీలో చేరిక

జహీరాబాద్ టౌన్: ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ మాజీ చైర్మన్, బీజేపీ నాయకులు జైపాల్‌రెడ్డి సమక్షంలో పలువురు కాంగ్రెస్ నాయకులు బుధవారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి జైపాల్ రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దామోదర్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఓపెన్ ప్లాట్ల కోసం సర్వే

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల గ్రామ పంచాయతీ పరిధిలోని మైసమ్మగడ్డ వద్ద సర్వే నెంబర్ 705లో ఓపెన్ ప్లాట్ల కోసం సర్పంచ్ చిమ్ముల నర్సింహ్మారెడ్డి బుధవారం కొబ్బరికాయలు కొట్టి సర్వే ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మొగులయ్య, పాలకవర్గ సభ్యులు సత్యనారాయణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

◆ కాంగ్రెస్‌లో చేరిక

నారాయణఖేడ్: తడ్కల్ మండలంలోని గాంధీనగర్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు వెంకన్న, రాములు, గంగారాం, లోకేష్, అంజన్న, పీరన్న, భూమన తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి ఉమ్మడి మెదక్ జిల్లా జెడ్పీ ప్రణాళికా సంఘం మాజీ సభ్యులు నగేష్ షెట్కార్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

◆ బీజేపీ నాయకుల పర్యటన

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని కాకిజన్‌వాడ, చీకుర్తి, అమీరాబాద్, అత్నూర్ తదితర గ్రామాల్లో బుధవారం బీజేపీ నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ జైపాల్‌రెడ్డి, నాయకులు రాంచందర్ రాజనర్సింహ, శ్రీనివాస్‌రెడ్డి, జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ మహిళల సంక్షేమానికి పెద్దపీట

పటాన్‌చెరు టౌన్: కేంద్ర ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. మండలంలోని ఇస్నాపూర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత ప్రధాని మోడీకే దక్కుతుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్‌గౌడ్, ధనరాజ్ షకీల్ తదితరులు పాల్గొన్నారు.

◆ సమస్యల పరిష్కారానికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్ పరిధిలోని ఆయా కాలనీలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ పుష్పనగేష్ తెలిపారు. బుధవారం డివిజన్ పరిధిలోని రామచంద్రరెడ్డి నగర్ కాలనీలో భూగర్భ డ్రైనేజీ పనులను ఆమె ప్రారంభించారు.

◆ మండపాల నిర్వాహకులు రుసుం చెల్లించాలి

మునిపల్లి(అందోల్): ఆయా గ్రామాల వినాయక మండపాల నిర్వాహకులు విద్యుత్ సరఫరా నిమిత్తం రుసుం చెల్లించాలని విద్యుత్‌శాఖ ఏఈ ప్రశాంత్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చిన్న మండపాల నిర్వాహకులు రూ.500 పెద్దమండపాల నిర్వాహకులు 100 చొప్పున రుసుం చెల్లించాలని సూచించారు.

◆ నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

జహీరాబాద్ టౌన్: పార్లమెంట్‌లో మహిళా బిల్లు ప్రవేశపెట్టినందునా బీజేపీ మహిళామోర్చ ఆధ్వర్యంలో బుధవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బీజేపీ మహిళా మోర్చ జిల్లా ఉపాధ్యక్షురాలు అనితస్వామి మహిళా నాయకులు శోభరాణి, నామల అపర్ణ, హస్నబాద్ రాజేశ్వరి పాల్గొన్నారు.

◆ ఈకేవైసీ గడువు పొడిగించాలి

సంగారెడ్డి టౌన్: రేషన్ కార్డుదారులు ఈ కేవైసీ చేసుకోవాలనే నిబంధన గడువును పెంచాలని కోరుతూ బుధవారం సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, నాయకులు పాల్గొన్నారు.

◆ ముదిరాజ్ సంక్షేమ సంఘం కన్వీనర్‌గా నర్సింహులు

జహీరాబాద్ టౌన్: ముదిరాజ్ సంక్షేమ సంఘం జహీరాబాద్ పార్లమెంట్ కన్వీనర్‌గా మండలంలోని రాయిపల్లి(డి) గ్రామ మాజీ సర్పంచ్ కొండపురం నర్సింహులు నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పుట్టి యాదగిరి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నర్సింహులు మాట్లాడుతూ ముదిరాజ్‌ల సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు.

◆ మాణయ్య సేవలు మర్చిపోలేనివి

హత్నూర (సంగారెడ్డి): కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దివంగత చార్ల మాణయ్య చేసిన సేవలు మర్చిపోలేనివని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆంజనేయులుగౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని లింగాపూర్‌లో చార్ల మాణయ్య 4వ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

◆ గణనాథుడికి పూజలు

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని 3వ వార్డు వాణినగర్, వేదిరి టౌన్‌షిప్, టీపీఆర్ ఆనంద్‌నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

◆ ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలి

హత్నూర(సంగారెడ్డి): ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి తీర్మానం చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని దౌల్తాబాద్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలను బుధవారం ప్రారంభించారు. నాయకులు ప్రసాద్, నవీన్, మల్లేశం, గణేష్ తదితరులు పాల్గొన్నారు.